# 11. పాఠకులారా, వర్థిల్లండి!

తెలుగు పలుకు అంటే చెప్పలేనంత ప్రేమ దామోదరానికి. తను పనిచేసే ఆ అన్యరాష్ట్ర ప్రాంతంలో అన్ని తెలుగు పత్రికలూ దొరికేవి కావు. రైల్వే స్టేషనులో ప్రముఖమైనవి దొరికేవి కాని తన ఇంటి కది చాలా దూరం. పైగా ఏ కొద్ది ప్రతులో వచ్చి ఇట్టే చెల్లిపోయేవి. మనసుంటే మార్గాలకేంలోటు? ఏజెంట్సుకి ముందే డబ్బు ఇచ్చేవాడు. ఎక్కడెక్కడి తెలుగు వాళ్ళనీ వలవేసి పట్టుకుని పాతకాపీ అయినా బతిమాలి చేజిక్కించుకునేవాడు. అనుకుంటాం గాని, మనం చేసే ఖర్చుల్లో పుస్తకాలకని వెచ్చించేది ఎన్నో వంతు! అని సర్దిచెప్పుకుని, ప్రతి ముఖ్యపత్రికకీ చందా కట్టేవాడు. 'మీరు చందాలు అందిస్తే, మేం అందచందాలు అందిస్తాం!' అనే పత్రికా ప్రకటనని మనసా నమ్మిన మహారాజపోషకుడు అతడు. కాని చదివే వారికన్న, అందుకుని చదివే వారు ఆ ఊరి పోస్టల్ డిపార్టుమెంటులో కొందరైనా ఉండటం చేత, కట్టిన చందా రశీదులు మాత్రమే అతన్ని చేరేవి. అక్కడ మామగారు టెలిగ్రామ్ ఇచ్చి రైలెక్కించిన పెళ్ళాన్ని ఈ ఊళ్ళో మరెవరో దింపేసుక్నుట్లు అతనెంతో బాధ పడిపోయేవాడు. దీనికి పరిష్కారమెలాగో అతనికి తోచలేదు. ఆ ఏడాది మన భాషలో వచ్చినన్ని చలన చిత్రాలు మరే భాషలోను రాలేదని ఏ 'సండే'లోనో చదివినప్పుడు అతను మరింత కొట్టుకుపోయేవాడు. 'ఏ పూర్వ పాపమో, ఏ కర్మఫలమొ పనిచేయుచుంటి ఈ పరుల రాష్ట్రాన' అని తపించేవాడు. సినిమాలు చూసే సిరి ఎలాగూ లేదు, తెలుగు పత్రికలయినా చదవందే ఎలా బతకడమో అతనికి అర్థం కాలేదు. అతని కింకా పెళ్ళవలేదు గనక పీక్కు తినే పెళ్ళాం లేదు. వాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళు గనక డబ్బు పంపించమని పీల్చుకు తినే తల్లితండ్రులూ లేరు. ఆ రకం ఎంజాయ్‌మెంటు అతనికి నచ్చదు గనక వ్యసనాలూ లేవు. చిన్నతనంలోనే సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద జీతం. ఎంత ఖరీదైనా నేను కొనుక్కుంటాను మహాప్రభో అని సిద్ధమైనా తెలుగు పత్రికలు దొరక్కపోతే 'ఇంత వయసు ఏం చేసుకోనురా!' అని గుంజీలు తీసే సినీగున్న గజలక్ష్మిలా తన సారస్వత దాహం ఎలా తీరాలి! ఏ ఫ్రెండ్ పెళ్ళికో అక్కడానుంచి ఆంధ్రాకి దామోదరం సెలవు పెట్టి వెళ్ళొస్తుంటాడు. ఏం లాభం! మిల మిల మెరిసిపోయే ఆ కొత్త కొత్త పత్రికల వన్నె చిన్నెలు వాటి కన్నిటికీ తనెంత దిగువగా, దూరంగా ఉన్నాడో గుర్తుచేసి అతన్ని మరింత క్రుంగిపోయేలా చేసేవి. పత్రికల్లో సీరియల్స్ చదివి వాళ్ళు చేసే చర్చల్లో తను పాల్గొలేకపోతున్నందుకు ఎంతో సిగ్గు అనిపించేది. నిజంగా తెలుగు పాఠకుడు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నాడు! సామాన్యజనం కూతురికి పెళ్ళవలేదనో, కుర్రాడికి జాబు దొరకలేదనో మధనపడతారు. ఇంకా అతి సామాన్యులు పంచదార దొరకలేదనో, మంచి బియ్యం మార్కెట్లోకిరాలేదనో, కిరసనాయిల్ ధర అకాశాన్ని అంటిందనో బాధపడతారు. సగటు తెలుగు పాఠకుడు ఇలాంటి తక్కువరకం చికాకులకి లొంగిపోడు. వర్థమాన రచయిత్రి వెన్నెలగడ్డ సరితాదేవి రాసిన ఇటీవల సీరియల్‌గా వస్తున్న 'కాటుక చీకటిలో పచ్చల పతకాలు' సస్పెన్సు భరించలేక ఆరుకోట్ల ఆంధ్రులూ వారం వారం ఆవురావురని ఎదురు చూడలేక

అలసిపోతున్నారట. ఈ సాహితీ పిపాసువులకు ఇల్లు అద్దెకు దొరకకపోవడం, ఇంటల్లుడు దారిలోకి రాకపోవడం లాంటి చచ్చు సమస్యలు వేధించవు. 'అవినాష్' తన ఎదురింటి చాంద్‌శ్రీని పెళ్ళి చేసుకుంటాడాలేక మేనకోడలు హిమైతాంగిని చేపడతాడా? ఇంతకీ తన ఇంట్లో గత, రెండు దశాబ్దాలుగా అంట్లు తోముతున్న షీలా తన కన్నతల్లే అని సబిత పోల్చగలదా? ఇలాంటి బర్నింగ్ ప్రాబ్లెమ్స్‌తో ఆంధ్ర యువత అట్టుడికినట్టు ఉడికిపోతోందట. ఇవన్నీ తలుచుకుని తను ఎంత వెనకపడి ఉన్నాడో పోల్చుకున్న దామోదరానికి ఆ క్షణమే ఎందుకు తల బద్దలుకొట్టుకు చచ్చిపోలేదో బోధపడేది కాదు. ఇంతకీ ఈ మధ్య నవలా ప్రపంచంలో వీస్తున్న నవప్రభంజనం ఈ ప్రవాసాంధ్రుడికి ఏపాటి ఎరుక? సీరియల్ చింతామణి అని పేరుబడ్డ తన ఫ్రెండొకడు వివరిస్తేగాని దామోదరానికి కళ్ళు విడలేదు. వినగా ఆశ్చర్యంతో విప్పారిన కళ్ళు మరి మూతపడనూలేదు!

"ఎంతసేపూ మనుషుల కథలు ఎంతకని, ఎన్నాళ్ళని రాయగలరు- ఎంతటి రైటర్స్ అయినా! ఇప్పుడు మనిషిని పట్టించుకోడం తగ్గించి, ఎంతో వెరైటీ అందిస్తున్నారు మన సాహితీ స్రష్టలు".

"బాగుంది సాటి మనిషినే అర్థం చేసుకోలేకపోతే మరేమిటి రాసేది-బూడిద".

"పొట్ట చేత్తో పట్టుకుని పైరాష్ట్రం చేరిన గాడిదగాడివి.... నీకేం తెలిసి చస్తుంది నీరి ఊహలు అందించే మజా! ఒక్క మానవమాత్రుణ్ణే పట్టుకు వేళ్ళాడితే చదవే వాళ్ళకి బోరుకొట్టదా? అయినా తెలివిగల తేజస్వికి మనిషి ఒక్కడేనా కథా వస్తువు? ఏం భూతాలు లేవా, పిశాచాలు లేవా? పాములు లేవా. పగటి కలలు. లేవా? మెస్మరిజాలు లేవా, మెర్మెయిడ్స్ లేరా? అతీంద్రియ శక్తులు లేవా, సైంటిఫిక్ మిస్టరీలు లేవా? ఏ సాహిత్య ప్రయోజనాలయినా ముఖ్యంగా రెండే కదా! ఒకటి: పత్రిక పేజీలు నిండాలి. రెండు: చదివినవాడికి గంటలు నిముషాల్లా దొర్లాలి. ఈ రెండూ దిగ్విజయంగా నిర్వర్తింపబడినంత కాలం ఇలా పెనం మీద పెసరట్టు అలా బల్లమీద ప్లేట్లోకి వచ్చినట్టు. సీరియల్స్ అన్నీ పుస్తక రూపంలో హాట్ కేక్స్‌లా చెల్లుతున్నప్పుడు వీటన్నిటకీ పనికిమాలిన సాహిత్యం అని ఏ కిట్టని వాడో పేరు పెడితే ఎవరికి నష్టం.' అంటూ దబాయించి, దంచి మరీ వదిలిపెట్టేడు ఆ ఫ్రెండు.

అతని సలహా ఊరికే పోలేదు. ఆ తర్వాత దామోదరం ఆంధ్రా ఎప్పుడు వెళ్ళొచ్చినా, ఆ వేళకి మార్కెట్లో, లభించిన అన్ని తెలుగు నవలలూ కొని కూడా తెచ్చుకునేవాడు. లోపలి సంగతి మాట అలా ఉంచి, పై రంగులకే మెరుగులకే అతను పులకించి పోయేవాడు. సామాజిక స్పృహఅంటూ అఘోరిస్తారు, తెగ తాగి స్పృహ తప్పిన కొందరు వెర్రి విమర్శకులు! సాహిత్యం అనేది జీవితానికి అద్దం పట్టాలిట! నేటి సామాజిక జీవనంలో ఏముంది-కంఠ్రోళ్ళూ కన్నీళ్ళూ తప్ప. ఈ కుయ్యో మొర్రోలు కాస్సేపు మరచిపోదామని ఆశ్రయించే పుస్తకాలలోకూడా ఆ ఏడుపు ఎందుకు? సగటు పాఠకుడికి వెగటు కలిగించవా ఇవి? మునుపు గణిత బోధినిలో ఎక్కానికి ఒక అచ్చు తప్పు అయినా పడేది. ఇప్పుడు ఆంధ్రాలో ప్రింటింగ్ టెక్నాలజీ అత్యద్భుతంగా పెరిగింది. వారపత్రికల్లోనే వచ్చిపడుతున్నాయి. పంచరంగుల కథలు. కనుచూపు తగ్గిన వారికయినా ఇబ్బంది కలగకుండా చదవడానికి అవకాశం

ఇచ్చే అందమైన అచ్చులో ప్రతి అక్షరం ఆప్యాయంగా చదువుకుని పరవశించిపోయాడు దామోదరం. విడుదల అయే సినిమాల సంఖ్యలాగే పుస్తకాలలో పత్రికలలో అతి త్వరలో ఆంధ్రా అందర్నీ తలదన్నేటట్టుందని గర్వం కలిగింది అతనికి. ఏమైనా లూప్ పెట్టించుకున్న ఆడదానిలా, లూప్‌లైన్లో పడి ఉన్న కాకినాడలా ఆ మారుమూల పడి ఉన్న దామోదరానికి పూర్తి తృప్తి వచ్చే అవకాశమే కనిపించలేదు. పాఠకుల పందెపు పోటీలో తన స్థాయి ఎంత ప్రయత్నించి నా వెనక పడుతూనే ఉంది. ఆఖరికి ఉత్తరాల శీర్షికలో తన పేరు చూసుకుందామని తన అభిప్రాయం రాసి 'సంపాదక మహాశయా! ఇది నా ఉత్తరమే! నేను రాసిందే! ఇది నా రైటింగే! ఇది దేనికీ అనువాదంగాని, అనుసరణగాని కాదు' అని హామీ పత్రం జోడించి, సొంత చిరునామాగల తగుమాత్రం స్టాంపులు అంటించిన కవరు లోపల ఉంచి పంపినా నేలలో వెళ్లడమేగాని వెలుగుచూసిన బాపతు ఒక్కటీ కనపడలేదు!

హౌస్ ఫుల్ అయాక ఎవరో అసలు రేటుకు టికెట్టు ఆఫర్ చేసినట్టు, దామోదరం కలలో అయినా ఊహించనిది కళ్ళెదుటే జరిగింది. విజయనగరంకి ట్రాన్స్‌ఫర్ అయింది అతనికి. ఇంకేం! అతని రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయింది. గరం గరం తెలుగు పత్రికలన్నీ అక్కడ అందరికన్న ముందు అతనే తిరగెయ్యవచ్చు. కొత్తగా ఏ ప్రతి బజార్లోకి దిగినా మొదటి కాపీ తన చేతిలోనే రెపరెప లాడించవచ్చు. సెకండ్ హాండ్ ఇన్వర్మేషను సేకరించలేక తను నవ్వులపాలయే దురదృష్టపు రాత ఇక తన మొహానికిక లేదు.

ఆఫీసులో చేరిన వారం రోజుల్లోనే తన సరదా తీరా పత్రికలు కొనేశాడు దామోదరం. కరువుతీరా పగలూ, రాత్రీ అనకుండా అన్నీ అమృతాంజనం మొదలు ఆవకాయ దాకా, పేజీ పేజీ పూతరేకుల్లా చప్పరించి తృప్తి చెందాడు. అక్కడ అడ్డాలో ఉండగానే తెలిసింది ప్రసిద్ధ కథకులు ఎవరెవరో ఇక్కడకొస్తూ ఉంటారని. వాళ్ళిలా ఉంటారు. వీళ్ళు వయసు ఇంతుంటుంది అనే ఫేవరెట్ తెలుగు రైటర్స్‌మీద అతని ఊహాగానం మరీ పెరిగిపోయింది. ఆఖరికి తన అభిమాన రచయిత కామసూరి అదే ఊళ్ళో అదే వీధికి ఏదో పనిమీద వచ్చాడని తెలిసిన రోజున అతని గుండె ఆగిపోతుందేమో నన్నంత గుబగుబ చెలరేగింది. ఇక అతని ఉత్సాహ ప్రవాహాన్ని కావేరికి ఆనకట్ట కట్టించిన విశ్వేశ్వరయ్య అయినా ఆపలేకపోయేవాడేమో! ఉరుకులతో పరుగులతో, ఉరుములతో, మెరుపులతో కామసూరి ఇంటి తలుపు తట్టాడు.

రెగ్యులర్‌గా రాసే 'ఆంధ్ర సీమ' వారపత్రిక స్టైయిలుకి తగ్గట్టుగానే డాబుగా కనిపించడం ఎంతో తృప్తి నిచ్చింది దామోదరానికి. తెలుగు పత్రికల తీరే వేరు, వాటిని నింపుతున్న రచయితల స్టయిలే వేరు. వాటికీ, అన్య భాషా పత్రికలవారికీ ఎంతతేడా! ఆ ఆలోచన దామోదరాన్ని నిలవనీయలేదు. ఆ ఫిగరు చూడు, ఆ విగరు చూడు, ఆ ఠీవి చూడు, పక్కనున్న టీవీ చూడు, కూచున్న పోజు చూడు, గురి చస్తున్న చూపు చూడు ఆ కాస్ట్లీ మేనర్సు చూడు, ఆ పవర్‌ఫుల్ ఫీచర్సు చూడు... అంటూ అతని మనసు అతన్ని వివశుణ్ణి చేసేసింది. ఎందుకొచ్చాడో ఓ పట్టాన

చెప్పలేకపోయాడు. అతి కష్టంమీద చేతిలో ఉన్న పూలగుత్తి బల్లమీద పెట్టి 'మీరు నా అభిమాన రచయితలు మిమ్మల్ని కలుసుకుని నా జన్మ ధన్యమయింది.' అనే మాటలు అవతలి వాడు ఏదో వారిస్తున్నా వినిపించుకోక అప్ప చెప్పినట్లు చెప్పేసి గిరుక్కున ఇవతలికి తిరిగి తలుపు తీసి అప్పుడే లోపల ప్రవేశిస్తున్న ఓ వ్యక్తికి మాడు అదిరేలా డాష్ ఇచ్చి వణుకుతూ 'సారీ' చెప్పి నిష్క్రమించాడు దామోదరం!

నిజానికి అప్పుడు లోపల ప్రవేశించిన వ్యక్తే కామసూరి! అంతకుముందు అక్కడ కూచుని దామోదరం మనసు చేత ఎక్స్ప్లోజివ్లీమే స్కులైన్ అని అభివర్ణించబడిన వ్యక్తి అసిస్టెంటు కలెక్టరుహోదా వెలిగిస్తున్న అతని బావగారు కామరాజు!

"చూశావా, బావా, 'నాహోదా ఓ జిల్లాకే పరిమితం ఇక నీ పేరు అన్నావా. అది యావదాంధ్ర లోకానికి పరిచితం అనేవాడివి! ఇప్పుడు తేడా తెలిసిందా స్పష్టంగా! ఆఫీసరుకి పూలగుత్తులు, రచయితకి మొట్టికాయలు! అన్నాడు కామసూరి నవ్వుతూ, తల తడుముకుంటూ.

"నేనో మాట అంటానోయ్, సూరీ, నువ్వు కోపం తెచ్చుకోకూడదు మరి. స్త్రీలని విశేషంగా ఆకర్షించి సినిమాలు డబ్బు చేసుకుంటున్నట్టు, పాఠకుల అమాయకత్వాన్నే చాలావరకు పత్రికలు క్యాష్ చేసుకుంటున్నాయి. నటులు, క్రికెటర్సు, రచయితలు.... ఇలాంటి వాళ్ళందరూ పబ్లిక్ ఫిగర్సు కాబట్టి, వాళ్ళ పాపులారిటీని బట్టి ఫాన్సు తప్పరు. వారి రచనల్ని ఫాలో అవుతున్న పాఠకులు ఆయా రచయితకి ఓ ఇమేజి ఏర్పరుచుకుంటారు. అలా తమని తీర్చి దిద్దుకోమని రైటర్సుకి సలహా ఇవ్వను గాని, సర్ప్రైజ్సెకి మాత్రం ఎదురుకాక తప్పదు. 'అంకుల్ టామ్స్ కాబిన్స్' రచయిత్రి ఎదురు పడితే-బానిస విముక్తి కోసం ఇంతటి విప్లవగ్రంథం సృష్టించి ధనికుల్ని గజగజలాడించిన దానివి.... ఇంత నీరసంగా ఉన్న నువ్వేనటమ్మా!" అని అబ్రహాం లింకన్ అంతటి వాడు ముక్కు మీద వేలేసుకున్నాడట. ఏమైనా అనుగాని ఇంతటి రచయితవి అయి ఉండి నువ్వీ గళ్ళ చొక్కా మాసిన పైజామా కట్టుకోడం నాకేం బాగులేదృమీ!" అన్నాడు కామరాజు.

ఎదుటి కుర్చీలో కూచున్న కామసూరి. అల్లాకాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఆ తరవాత ఆరంభించాడు. ఇక మధ్యలో కామరాజు బ్రేకులు వేసినా ఆ బండి ఆగలేదు. 'సాహిత్యం అనేది పెట్టుబడిదారీ వర్గం చేతిలో చిక్కి వ్యాపారంగా మరి, ప్రచార స్థాయికి దిగిపోయిందని తెలిశాక రాయకుండా మానుకోడమే అసలైన సాహిత్య సేవ. కాని, మనసులో సరుకూ, గుండెలో పలుకూ ఉండి ఓసారి అచ్చులో బరుకుడు అలవాటైన మేధావి- ఇన్ని అవకాశాలు ఆకర్షిస్తుంటే, తెచ్చుకున్న పేరు పేనులా కొరుకుతూ ఉంటే ఆ దురదకి తట్టుకోడం తలకు మించిన భారం. పారమార్థికం పారవేస్తేకదా ఆర్థికం మిగిలేది! ఇప్పుడు లేరుగాని.... ఉంటే పోతనా, త్యాగయ్యా లాంటివాళ్ళుకూడా పబ్లిషర్సు చుట్టూ తిరిగే వాళ్ళేమో! పాఠకులు మేకలుగా ఉండడానికి నిశ్చయించుకుని, పచ్చగడ్డిని చూసి పంచభక్ష్య పరమాన్నాలుగా భ్రమించినంత కాలం పబ్లిషర్సు మేకవన్నె పులులు కాక తప్పదు.

దేశంలో దారిద్ర్యం పెరిగినకొద్దీ అమాయకులకి రంగులవలలో చిక్కుకుందామనే తపన పెరిగిపోతూంది ఇప్పుడు నలుపు తెలుపుల్లాంటి సాదా రంగులు సామాన్యుడికే నచ్చడం లేదు. రంగుల సినిమా రంగుల టీవీతోపాటు రంగు రంగులు లేని పత్రికలకు కూడా పాకిపోయాయి. ఇక ఆ పత్రికల సర్క్యులేషన్ నలుగురైదుగురు 'గిరాకీని బట్టి సరుకు తయారీ' మార్కు రచయితల గుప్పిట్లో చిక్కినప్పుడు, నాలాంటి రచయితలుకూడా ప్రవాహంలో కొట్టుకుపోకుండా బతికి బట్ట కట్టాలనే భ్రమ జయించలేకపోతే వేషమయినా మార్చాలి. హారర్ ఎండ్ అబ్సీన్ సీరియల్స్ అయినా తలపెట్టాలి!"

★